క్లుప్తంగా

సాగునీరు అందించాలని డిమాండ్

సాక్షి, భీమవరం: జిల్లాలో సాగునీరు విడుదల చేసి నెల రోజులైనా పూర్తి స్థాయిలో నీరందక నేటికి నారుమడులు వేసే పరిస్థితి లేదని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం ముందస్తు సాగు అంటూ గతనెల ఒకటవ తేదీన సాగునీరు విడుదల చేసిందన్నారు. పంటకాలువలు ఆధునీకీకరణ చేయకపోవటంతో పూర్తి స్థాయిలో ప్రవాహం లేక జిల్లాలో అనేక ప్రాంతాల్లో నారుమడులు వేయలేదన్నారు. తీరప్రాంత మండలాలైన యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, భీమవరం వంటి మండలాల్లో ఏళ్లతరబడి మురుగు కాలువలు తవ్వకపోవడంతో కొద్ది పాటి వర్షం వచ్చినా పంటలు మునిగి పోతున్నాయనే ఆందోళనతో నేటికి నారుమళ్లు వేయలేదన్నారు. తక్షణమే సాగునీరు పూర్తిగా విడుదల చేసి మురుగు కాలువలను తవ్వాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలకు రెక్కలు

ఆకివీడు: ఓ వైపు వర్షాభావ పరిస్థితులు, మరో వైపు పంట కాల్వల్లో నీరు అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ ప్రభావం కూరగాయల పంటలపై చూపుతోంది. దిగుబడి, ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. రైతు వద్ద సాధారణ ధరలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటిని రెండింతలకు పైగా వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. పచ్చిమిర్చి ధర కిలో రూ.160లకు చేరుకుంటే, టమాటా ధర కిలో రూ.100 నుంచి రూ.120కు, వంకాయలు కిలో రూ.100, దొండ, బెండ కాయలు కిలో రూ. 80లకు విక్రయిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

ఉండి: పాములపర్రులో పేకాటస్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ గీతాకృష్ణ తెలిపారు.


రీసర్వే పనులు పరిశీలించిన ఆర్డీఓ



పెదఅమిరంలో రీసర్వే ఆన్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో దాసి రాజు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆదివారం భీమవరం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఆన్‌లైన్ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ టీపీ కృష్ణారావు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు. అదే విధంగా కోలనపల్లి గ్రామంలో స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ కృష్ణారావు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.


రైతులకు పనిముట్ల అందజేత



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న దృశ్యం

కాళ్ల: రైతులే దేశానికి వెన్నెముక అని లయన్స్ గవర్నర్స్ ప్రతినిధులు అన్నారు. ఏలూరుపాడు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జై జవాన్ జై కిసాన్ కింద గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అయిన కొడవళ్లు, పారలు అందజేశారు. అదేవిధంగా వృద్ధులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కనగర్ల వెంకట సత్యనారాయణ క్లబ్ సభ్యులు బాలాజీ, సత్యనారాయణమూర్తి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్యారేజీ బ్యాగ్‌ల పంపిణీ



ఉపాధ్యాయులకు క్యారేజీ బ్యాగ్‌లు పంపిణీ చేసిన జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు

ఆకివీడు: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు క్యారేజీ బ్యాగ్‌లను ఆదివారం పంపిణీ చేశారు. తన తల్లి వేగేశ్న సరోజినీ జ్ఞాపకార్థం సరోజినీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ బ్యాగ్‌లను మండలంలోని 500 మంది ఉపాధ్యాయులకు అందజేశారు.

క్షీరపురి ఆరోగ్య సిరి

- నియోజకవర్గంలో మూడు కొత్త పీహెచ్‌సీలు
- ఏడాది నుంచి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం సేవలు
- గుమ్మలూరు, పాలకొల్లు రూరల్ పీహెచ్‌సీలు ఏర్పాటు



రామారావుపేటలో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర నూతన భవనం



రూ.1.5కోట్లతో ఆధునికీకరిస్తున్న లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం



రూ.13 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా ఆధునికీకరిస్తున్న పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి

పాలకొల్లు అర్బన్: క్షీరపురిగా ప్రసిద్ధి చెందిన పాలకొల్లులో వైఎస్సార్ సీపీలో ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరోగ్య సిరి నెలకొంది. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. నియోజకవర్గంలో కొత్తగా మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో నియోజకవర్గంలోని లక్ష మంది పైగా పేద ప్రజలకు ప్రభుత్వం వైద్య సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తున్నారని ప్రజల విశ్వసిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కి వైద్య రంగంలో పూర్తి అనుభవం ఉండడంతో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. పాలకొల్లు మండలంలోని దగ్గులూరులో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేయించారు. ఈ మెడికల్ కళాశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి ఈ కళాశాలలో అడ్మిషన్లు జరిపించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అలాగే పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిని రూ.13 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా ఆధునికీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన భవనాలు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తికానున్నాయి. అలాగే లంకలకోడేరు, మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.3కోట్లతో అదనపు భవనాలు నిర్మిస్తున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.1.10కోట్లతో నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని ఇటీవల రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు.

మూడు పీహెచ్‌సీల ఏర్పాటు

నియోజకవర్గంలోని పాలకొల్లు మండలానికి సంబంధించి పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట, గోరింటాడ, నగంచెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, పాలకొల్లు రూరల్-01, పాలకొల్లు రూరల్-02, ఉల్లంపర్రు, పూలపల్లి, వరిధనం, భగ్గేశ్వరం గ్రామాలకు సంబంధించి రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభించారు. ఇరువురు వైద్యులను నియమించారు. వీరు ప్రస్తుతం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గుమ్మలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొత్తగా ప్రారంభించారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో పెనుమదం-1, పెనుమదం-2 జిన్నూరు-01, జిన్నూరు-02, మట్టపర్రు, వేడంగి, గుమ్మలూరు-01, వద్దిపర్రు-02, అప్పన్నచెరువు గ్రామాల ప్రజలకు వైద్య సేవలు పొందుతారు.

దిగమర్రులో రూరల్ పీహెచ్‌సీ



రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దిగమర్రులో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధుల నిర్ణయం తీసుకున్నారు. అర ఎకరం ప్రభుత్వ స్థలం కోసం సర్వే చేస్తున్నాం. అవసరమైతే దాతల సహకారంతో స్థల సేకరణ చేస్తాం. దిగమర్రులో రూరల్ పీహెచ్‌సీ ఏర్పాటు వల్ల యలమంచిలి, నరసాపురం మండలాల ప్రజలకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

– రాపాక నగేష్ కరుణాకర్, సర్పంచ్, దిగమర్రు

ప్రజలకు చేరువగా సేవలు



పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని రామారావు పేటలో ఏర్పాటు చేయడం వలన లాకు దిగువన ఉన్న 10 వార్డు ప్రజలకు చేరువైంది. రైల్వే గేటు పడిన సమయంలో రోగులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లడానికి ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆ సమస్య లేదు. హౌసింగ్ బోర్డు, లజపతిరాయపేట, గరువు, వీవర్స్ కాలనీ, క్రిస్టియన్‌పేట, గుత్తులవారిపేట, అల్లు వెంకట సత్యనారాయణ కాలనీ ప్రజలందరికీ ప్రభుత్వం వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– కోరాడ శ్రీనివాస్, రామారావుపేట

యువతను తప్పుదోవ పట్టించేలా పవన్ ప్రసంగం



కర్రి గౌరీసుభాషిణి

పెనుమంట్ర: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్ర లో చేసే వ్యాఖ్యలు యువతను తప్పుదోవ పట్టించేలా ఉన్నా యని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వారాహి సభల్లో చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే రాష్ట్రంలో యువతను రెచ్చగొట్టి, వారిని చెడు మార్గాల వైపు నడిపించే విధంగా ఉంటున్నాయని వివరించారు. మద్యం ప్రజల నిత్యావసర వస్తువుగా సంభోదిస్తూ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే ఆయనలో రాజకీయ పరిపక్వత ఏ విధంగా ఉందో? ప్రజలకు అర్థమవుతుందన్నారు. కూరగాయలు, అపరాలు వంటి నిత్యావసర వస్తువులు ధరలు తగ్గిస్తామని రాజకీయ పార్టీలు ప్రకటనలు చేస్తుంటాయని, అందుకు భిన్నంగా పవన్‌కల్యాణ్ మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు మాని రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏవిధంగా అమలు జరుగుతున్నాయో? గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఏవిధంగా అందుతున్నాయో? వారి కార్యకర్తలను అడిగితే చెబుతారని పేర్కొన్నారు.

బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉద యం నుంచి విపరీతమైన ఎండ, వేడిగాలులతో వాతావరణం వేడిగా ఉన్నా పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. ఇటీవల బీచ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టులో ఎస్సైగా నియమించినా హరిబాబు బీచ్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వేంకటేశ్వర స్వామి, వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజ నేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శిరగాలపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. శిరగాలపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఏదైనా సాంకేతిక సమస్య వల్ల అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోతే ఆ సమస్యలు తొలగించి అర్హులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న జగనన్నను ప్రజలంతా మరొకసారి ముఖ్యమంత్రిని చేయాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వీరవల్లి నరసింహమూర్తి సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు పార్టీ నాయకులు పైడి వెంకటేశ్వరరావు, సజ్జా శ్రీనివాస్, వల్లూరుపల్లి నరసింహమూర్తి, దొంగ నాగలక్ష్మి ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజహితం కోసమే లయన్స్ సేవలు



ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న నరసాపురం లయన్స్ క్లబ్ సభ్యులు

నరసాపురం రూరల్: సమాజహితం కోసం లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు ఎనలేనివని శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం నరసాపురం జై రాజేంద్ర లయన్స్ సర్వీస్ సెంటర్‌లో నిర్వహించిన నరసాపురం లయన్స్‌క్లబ్, నరసాపురం ఫెమినా లయన్స్ క్లబ్‌ల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సంస్థలు సమాజహితం కోసం నిరంతరం పనిచేయడం ఎంతో గౌరవమైన విషయమన్నారు. లయన్స్ క్లబ్‌లోని సభ్యులంతా ఎంతో ఉన్నతమైన సేవా బావం కలిగిన వారు కావడం వల్లే క్లబ్ సేవలు విస్తృత మవుతున్నాయని కొనియాడారు. నరసాపురంలోని లయన్స్ ఆడిటోరియం అనేక సేవలకు స్థావరంగా ఉందన్నారు. కరోనా విపత్తు వేళ ప్రజలకు పలు రకాల సేవలందించడంలో ఈ ఆడిటోరియం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు కూడా క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నరసాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పులపర్తి ప్రతాప్, కార్యదర్శిగా కె.బాలాకుమారి, ట్రెజరర్‌గా రంగినీడి భరణిలతో పాటు పలువురు క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పలువురు పేదలకు నిత్యావసర సరుకుల కిట్‌లను అందించారు. కళ్యాణి మానసిక వికలాంగ పాఠశాలకు రూ.5వేల నగదును పాస్ట్ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, మేకా శ్రీరామ్‌సురేష్, పాపారావునాయుడు, కేబీ ఫణీంద్రుడు, రోజారమణి పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూముల పరిరక్షణకు శ్రీకారం



నరసాపురం డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: అందుబాటులోకి వచ్చిన ఆధునిక సర్వే టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పట్టణ పరిధిలోని సమస్త భూ రికార్డులను పక్కాగా రీ సర్వే చేసే పనులు నరసాపురం పట్టణంలో ప్రారంభమైనట్లు మున్సిపల కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడకు చెందిన క్రిష్టల్ పాల్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం డ్రోన్ సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో కలిసి డ్రోన్ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జగనన్న భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా చేస్తున్న ఈ సమగ్రమైన భూ సర్వే విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను గుర్తిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. సమగ్ర సర్వే పూర్తయిన అనంతరం భూహక్కు పత్రాలను ప్రజలకు అందిస్తామని వివరించారు.

మత మార్పిడులకు ప్రోత్సహిస్తే సహించం



హిందూ చైతన్య సమ్మేళన సభలో మాట్లాడుతున్న పెరికిపాలెం శ్రీనివాస్

యలమంచిలి: పరమత సహనం మన దేశ విధానమని ఆ పేరు చెప్పి అన్య మతస్తులు హిందువుల వద్దకు వెళ్లి మతం మారమని ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు పెరికిపాలెం శ్రీనివాస్, శిరంగు నాయుడు హెచ్చరించారు. దొడ్డిపట్ల గ్రామంలోని విజయసారథి కాలనీలో ఆదివారం జరిగిన హిందూ చైతన్య సమ్మేళన సభలో వారిరువురు మాట్లాడుతూ హిందువుల్లో ఉన్న అహింసా సిద్ధాంతాన్ని అలుసుగా తీసుకుని అన్య మతస్తులు మత మార్పిడులను ప్రోత్సహిస్తూ గ్రామాల్లో ర్యాలీలు, ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో బజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు ముత్యాల చంటి నాయకులు దివి ప్రకాష్, గుబ్బల బాబ్జీ, ముత్యాల నాగ బాలాజీ, పిల్లి మాధవ బీజేపీ నాయకులు వీరాజీ, నామన శ్రీనివాస్, కారిచర్ల పతంజలి, లక్కోజు శేషు, కామాడి శ్రీను, శేరు నాగబాబు, గుడాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సంపద



కాంబొట్లపాలెంలో కాయగూరల విత్తనాలు ప్యాకింగ్ చేస్తున్న డ్వాక్రా మహిళలు

యలమంచిలి: రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్య సంపద పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి కోరారు. కాంబొట్లపాలెంలో ఆదివారం ఆమె డ్వాక్రా మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు వివరించారు. ఈ సందర్భంగా పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవడానికి రసాయనిక ఎరువుల వైపు వెళ్లకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణంతో ఎలా రక్షించవచ్చు? అనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం కోడిగుడ్డు, నిమ్మకాయ రసం తయారీ విధానం వివరించారు. మహిళలంతా తమ పెరటిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో కాయకూరలు, ఆకు కూరలు సాగు చేసి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలతో కాయకూరలు, ఆకు కూరల విత్తనాలు ప్యాకింగ్ చేయించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి జ్యోతి, ఐసీఆర్‌పీలు జడ్డు లక్ష్మీనారాయణ, కె సోని, బి లక్ష్మీదుర్గ డ్వాక్రా యానిమేటర్ కుక్కల వరలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యత



చింతపల్లి రాధాకృష్ణ

పోడూరు: వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీ కులాలన్నింటికీ ప్రాధాన్యత కల్పిస్తున్నారని జాతీయ బీసీ మహాసభ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి రాధాకృష్ణ అన్నారు. జిన్నూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక కార్పొరేషన్‌ల ఏర్పాటు ద్వారా అన్ని బీసీ కులాలకు న్యాయం చేస్తున్నారన్నారు. మంత్రివర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రాముఖ్యత కల్పించారన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో అందించిన మంచి పరిపాలనతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీసీ కులాలకు చెందిన పేద, సామాన్య కుటుంబాలు విద్యాపరంగా, వ్యాపారపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడం చూస్తున్నామన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ, ఇంటింటికీ రేషన్ ఏర్పాటుతో లక్షలాది మంది బీసీ యువత ఉద్యోగాలు, ఉపాధి పొందిందన్నారు. అన్ని బీసీ కులాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయడమే జాతీయ బీసీ మహాసభ లక్ష్యమన్నారు. రాబోయే కాలంలో పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో బీసీ కులాల ప్రజలను చైతన్యం చేస్తామని రాధాకృష్ణ తెలిపారు.

ముగియనున్న మామిడి సీజన్

నరసాపురం రూరల్: నరసాపురం ప్రాంత మామిడికి రాష్ట్రంలోనే కాక దేశ విదేశాల్లో కూడా మంచి పేరుంది. అయితే ఈ ప్రాంత మామిడి సీజన్ ఆఖరులో దిగుబడి వస్తుంటుంది. ఈ ఏడాది పూత దశలో వర్షాలు విరివిగా పడటంతో మంగు, పుచ్చు తెగుళ్ల విపరీతంగా సోకడంతో వచ్చిన కొద్ది దిగుబడి కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లో పూర్తిగా సీజన్ ముగిసే పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ దిగుబడి లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. మామిడికి తెగుళ్లు సోకడం సహజమే అయినప్పటికీ తెగుళ్లకు పిచికారీ చేసే మందులు వినియోగించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. తెగుళ్లకు తోడు విపరీతమైన ఎండ వేడిమికి కాయలు నేలరాలడం తదితర కారణాలతో మామిడి రైతు నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఏదేమైనప్పటికీ సీజన్ ముగుస్తుండడంతో మళ్లీ వచ్చే మామిడి సీజన్ బాగుండాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా సిల్టు తొలగింపు పనులు



సిల్టు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు

పోడూరు: జిన్నూరు గ్రామంలో గత 2 రోజులుగా గ్రామంలోని డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను ఆదివారం సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, ఉప సర్పంచ్ దండు గోపాలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం సమీపించడంతో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా తణుకు నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌ఆర్‌పేట, భూపయ్యచెరువు, మెయిన్ విలేజ్, కొత్తపేట, సూర్యాకాలనీ, రమణ నగర్, నర్సరాజునగర్, జిన్నూరుపాలెం తదితర ప్రాంతాల్లో సిల్టు తొలగింపు పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే డ్రెయినేజీలు లేని చోట కచ్చా డ్రెయిన్‌లు తవ్వుతున్నట్లు చెప్పారు.

జగనన్న సురక్ష సభల షెడ్యూల్ ఇలా

పెనుమంట్ర: మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాలు వివరాలను ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సురక్ష కార్యక్రమాల నిర్వహణకు అధికారులను రెండు టీమ్‌లుగా నియమించారు. టీమ్-1కు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, టీమ్-2కు ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోని జగనన్న సురక్ష కార్యక్రమానికి మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరుఅవుతారని వివరించారు. మంగళవారం ఓడూరు, నెలమూరు, 6న నెగ్గిపూడి వెలగలేరు, 11న మార్టేరు -1, 2 సచివాలయాలు, 13న సత్యవరం, వెలగలవారిపలెం, 15న పొలమూరు,-1,2 సచివాలయాలలో, 18న నత్తారామేశ్వరం, మాముడూరు, 20న పెనుమంట్ర1,2 సచివాయాలు, 25న జుత్తిగ, మల్లిపూడి, 27న ఎస్.ఇల్లిందలపర్రు గ్రామసచివాలయల్లో ఈసురక్ష సభలు జరుగుతాయని లబ్ధిదారులు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా శామ్యూల్ హానిమెన్ వర్ధంతి

భీమవరం (ప్రకాశంచౌక్): హోమియోపతి పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమెన్ వర్ధంతిని గునుపూడిలో ఆదివారం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఎం.గోవిందబాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక వైద్య పద్ధతి హోమియోపతి అని, ఈ పద్ధతి దాదాపు రెండు వందల ఏళ్ల నుంచి వాడుకలో ఉన్నప్పటికీ, దీనికి శాస్త్రీయమైన పునాదులు లేవనే నింద ఒక చెరగని మచ్చలా ఉండిపోయిందన్నారు. చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ హానిమెన్ హోమియోపతి వైద్యం ముఖ్యంగా మూడు అంశాలపై ఆధారపడి ఉందని అన్నారు. భట్టిప్రోలు శ్రీనివాస్, చుక్కనశ్రీ తదితరులు పాల్గొన్నారు.